సాక్షి నంద్యాల

మంగళవారం ၊ 24 ၊ సెప్టెంబర్ ၊ 2024



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం వెండి రథోత్సవాన్ని నిర్వహించింది. ముందుగా సహస్ర దీపార్చన పూజలు చేపట్టారు.



అలరించిన నృత్య ప్రదర్శన

శ్రీశైలం టెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా సోమవారం సికింద్రాబాద్‌కు చెందిన కీర్తి ఆర్ట్స్ అకాడమీ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం (అడుగులు)	:1,633
ప్రస్తుతం	:1,632
సామర్థ్యం (టీఎంసీలు)	:105.788
ప్రస్తుతం	:101.735
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:10,564
అవుట్ ఫ్లో	:10,144

న్యూస్‌రీల్

విద్యార్థులకు కలెక్టర్ అభినందనలు



రుద్రవరం మోడల్ పాఠశాల విద్యార్థులను అభినందిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

రుద్రవరం: నీట్‌లో ప్రతిభ చాటి మెడికల్ సీట్లు సాధించిన తువ్వపల్లె సమీపంలోని ఏపీ మోడల్ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులను సోమవారం కలెక్టర్ రాజకుమారి అభినందించారు. విద్యార్థులు బిందు, ఛాయాదేవి, లోకేష్, పూజిత, శరత్ నీట్‌లో ర్యాంకులు పొంది ప్రభుత్వ మెడికల్ కళాశాలల్లో సీట్లు సాధించారు. ఆ ఐదుగురు విద్యార్థులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని డీఈఓ సుధాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంగెపు నాగేశ్వరరావు ద్వారా ప్రత్యేకంగా కలెక్టరేట్‌కు పిలిపించుకుని అభినందించారు. భవిష్యత్తులో ఇలాగే మంచిగా చదివి ప్రజలకు సేవలు చేయాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు.

డీఆర్‌డీఏలో బదిలీలు

నంద్యాల(న్యూటౌన్): జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ)లో ఉద్యోగుల బదిలీలు చోటు చేసుకున్నట్లు పీడీ శ్రీధర్‌రెడ్డి సోమవారం తెలిపారు. నంద్యాల డీఆర్‌డీఏ కార్యాలయంలో ఏపీఎంగా పనిచేస్తున్న శ్రీనివాసులు బనగానపల్లె వెలుగు కార్యాలయానికి బదిలీ అయ్యారన్నారు. ఆళ్లగడ్డ ఏరియా కోఆర్డినేటర్ దానం ప్రకాశం జిల్లా ఎర్రగొండ పాలెంకు, బనగానపల్లె వెలుగు కార్యాలయం ఏపీఎం తిరుపాల్‌రెడ్డి నంద్యాలకు, నందికొట్కూరు ప్రాజెక్టు మేనేజర్ దేగలయ్య ఐటీడీఏ రంపచోడవరానికి బదిలీ అయినట్లు పీడీ తెలిపారు.

34 మంది డిప్యూటీ తహసీల్దార్ల బదిలీ

నంద్యాల(అర్బన్): జిల్లాలో డిప్యూటీ తహసీల్దార్లను బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ రాజకుమారి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఒకేసారి 34 మంది డీటీలకు స్థానచలనం కలిగింది.

ఫిర్యాదులు పునరావృతం కాకూడదు



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

బొమ్మలసత్రం: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులు పునరావృతం కాకుండా చూడాలని ఎస్పీ అధిరాజ్ సింగ్‌రాణా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 135 ఫిర్యాదులు అందాయి. అందులో ఎక్కువగా భార్యాభర్తల మధ్య తగాదాలు, అత్తింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి వివాదాలు తదితర ఫిర్యాదులు అందాయని ఎస్పీ తెలిపారు. అందులో చట్టపరమైన సమస్యలను వెంటనే పరిష్కరించామని, కొన్ని ఆయా స్టేషన్ అధికారులకు బదిలీ చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సీఐలు మోహన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, నిరంజన్‌రెడ్డి, ప్రియతమ్‌రెడ్డి, యువరాజు, సురేష్, సీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పోతిరెడ్డిపాడు నుంచి భారీగా నీటి విడుదల తగ్గింపు

జూపాడుబంగ్లా: పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ నుంచి ఐదు రోజులుగా నీటి విడుదలను అధికారులు క్రమేపీ తగ్గిస్తున్నారు. సోమవారం 15 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. ఈనెల 19న శ్రీశైలం డ్యాంలో 879.70 అడుగుల నీటిమట్టంతో 186.42 టీఎంసీల నీరు నిల్వ ఉండగా పోతిరెడ్డిపాడు నుంచి ఆరుగేట్ల ద్వారా 35 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో విద్యుత్ ఉత్పత్తికి దిగువకు నీటిని విడుదల చేయడంతో శ్రీశైలం డ్యాంలో రోజు రోజుకు నీటిమట్టం పడి పోతుంది. దీంతో పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదల తగ్గడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది.

డీసీసీబీలో కర్షకవృద్ధి డిపాజిట్ పథకం

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆకర్షణీయమైన వడ్డీరేటుతో కర్షకవృద్ధి డిపాజిట్ పథకాన్ని తీసుకొచ్చినట్లు సీఈఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 333 రోజుల డిపాజిట్‌పై సీనియర్ సిటిజన్‌కు 8 శాతం(ఎఫెక్టివ్ రేటు 8.22 శాతం), 60 ఏళ్లలోపు వారికి 7.5 శాతం(ఎఫెక్టివ్ రేటు 7.67 శాతం) ఉంటుందన్నారు. ఈ పథకం నవంబరు 1వరకు అమలులో ఉంటుందన్నారు.

- ప్రకృతి వనరులను కొల్లగొడుతున్న తమ్ముళ్లు
- మట్టి మాఫియాకు ఆళ్లగడ్డ అన్న అండదండలు
- యథేచ్ఛగా గ్రావెల్, మట్టి అక్రమ తవ్వకాలు
- కళ్లు మూసుకున్న పోలీస్, రెవెన్యూ, మైనింగ్, అటవీ శాఖలు
- రాజకీయ ఒత్తిళ్లు, మామూళ్ల మత్తులో అడ్డు చెప్పని అధికారులు



రుద్రవరం సమీపంలోని తువ్వపల్లె తిప్పలో మట్టిని లోడు చేస్తున్న దృశ్యం

అయ్యో రామా కొండంత దోపిడీ

నల్లమల తిప్పల్లో మట్టి దొంగలు పడ్డారు. కొండకింద పల్లెల స్థానికతకు నిలువుటద్దంలా నిలిచిన తిప్పలు క్రమంగా కరిగిపోతున్నాయి. అధికార పార్టీ ప్రజా ప్రతినిధి భర్త కనుసన్నల్లో ఆళ్లగడ్డ నియోజకవర్గ వ్యాప్తంగా జోరుగా మట్టి దందా సాగుతోంది. అక్రమ మట్టి తవ్వకాలతో తిప్పలు, పచ్చికబయళ్లు, వాగు, తోపు, పోరంబోకు స్థలాలతో పాటు చివరకు చెరువులు, కాల్వలు సైతం ఆనవాళ్లు కోల్పోతున్నాయి. అక్రమ మట్టి తవ్వకాలను అడ్డుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో అటు వైపు కన్నెత్తి చూడటం లేదనే విమర్శలు ఉన్నాయి. – సాక్షి టాస్క్‌ఫోర్స్



మట్టితవ్వకాలతో ఆనవాళ్లు కోల్పోతున్న గుట్ట

జిల్లాలోని ఆళ్లగడ్డ నియోజకవర్గానికి అడవుల ఖిల్లాగా పేరుంది. 40 గ్రామాల పరిధిలో సుమారు 100 కి.మీ మేర అటవీ, రెవెన్యూ తిప్పలు (గుట్టలు) ఉన్నాయి. ప్రకాశం జిల్లా, వైఎస్సార్ జిల్లా సరిహద్దు ప్రాంతాల్లో కిలోమీటర్ల మేర ఉన్న మట్టి తిప్పలు ఆహ్లాదంతో పాటు వేలాది కుటుంబాలకు ఉపాధిని కల్పిస్తాయి. అయితే అధికారుల ఉదాసీనత, అధికార పార్టీ నేత కాసుల కక్కుర్తితో తిప్పలన్నీ కరిగిపోతున్నాయి. ఇష్టారాజ్యంగా సాగుతున్న మట్టి తవ్వకాలతో పచ్చదనం మాయమవుతోంది. నియోజకవర్గంలో మట్టి మాఫియా పెట్రేగి కొండలను కొల్లకొడుతున్నా అడ్డుకునేవారు కరువయ్యారు. అధికార పార్టీ నేత అండదండలతో తెలుగు తమ్ముళ్లు రెచిపోతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ రూ. కోట్లు మూటగట్టుకుంటున్నారు. నిబంధనల మేరకు అనుమతులు తీసుకుని తవ్వకాలు జరిపితే ఖనిజ పరిమాణం మేరకు ఒక ఘనపు మీటరు మట్టి తరలించేందుకు ప్రభుత్వానికి సుమారు రూ. 20 చెల్లించాలి. రాయల్టీ రూపంలో ఒక టిప్పర్‌కు రూ. 240 నుంచి రూ. 300 వరకు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంటుంది. లీజు, పర్యావరణ అనుమతులు తప్పనిసరి. మహానంది, శిరివెళ్ల, రుద్రవరం, ఆళ్లగడ్డ, చాగలమర్రి మండలాల పరిధిలో రేయింబవళ్లు సుమారు వెయ్యి టిప్పర్ల మట్టి అక్రమంగా తరలిపోతోంది. ఈ లెక్కన నెలకు దాదాపు రూ. కోటి వరకు ప్రభుత్వ ఆదాయానికి అక్రమార్కులు గండి కొడుతున్నారు. పోలీస్, రెవెన్యూ, అటవీ అధికారులకు ప్రజలు ఫిర్యాదు చేసినా ఏమాత్రం పట్టించుకోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. అక్రమ మట్టి తవ్వకాలు సాగిస్తున్న ప్రాంతాల్లో స్థానికులు అభ్యంతరం వ్యక్తం చేస్తే అధికార పార్టీ నేత బెదిరింపులకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది.

కప్పం కట్టలేక..

మండల కేంద్రం చాగలమర్రికి చెందిన ఓ టీడీపీ నేత కలుగొట్ల పల్లె రస్తాలోని తన 10 ఎకరాల పొలంతో పాటు మరో 10 ఎకరాలు అనధికారికంగా లీజుకు తీసుకుని జేసీబీని సైతం కొనుగోలు చేసి మట్టి దందా మొదలు పెట్టాడు. ఈ విషయం ఆళ్లగడ్డ అన్న దృష్టికి వెళ్లడంతో పిలిపించి 'పొలం నీదైనా కప్పం కట్టాల్సిందే.. లేకుంటే అధికారులు దాడులు చేస్తారు' అని బెదిరించడంతో ట్రిప్పునకు రూ. 300 అన్నకు చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకున్నాడు. అయితే రోజుకు ఎన్ని ట్రిప్పులు తరలిస్తున్నారో లెక్క రాసుకునేందుకు తన మనిషిని పెడుతా అనడంతో భయపడి నాయకుడు చివరకు మట్టి దందాను నిలిపేశాడు.

తమ్ముడు తమ్ముడే.. దందా దందానే..

రుద్రవరం మండలం ఆలమూరు రెవెన్యూ, అటవీ శాఖల పరిధిలో వేలాది ఎకరాల విస్తీర్ణంలో మట్టి తిప్పలు ఉన్నాయి. ఈ గ్రామానికి చెందిన రెండు వర్గాలు జేసీబీలతో తవ్వి పోటాపోటీగా గ్రావెల్‌ను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నాయి. ఈ విషయం అన్నకు తెలిసింది. తనకు కమీషన్ ఇవ్వాల్సిందే అంటూ హుకుం జారీ చేశాడు. తాము.. అధికార పార్టీకి చెందిన వారమంటూ మట్టి తోలకం కొనసాగించారు. అయితే ఆగ్రహించిన అన్న వెంటనే తన మనిషిని పంపించి రెండు జేసీబీల తాళాలు తెప్పించుకున్నాడు. గ్రామస్తులు అందరూ వెళ్లి అన్నను ప్రసన్నం చేసుకుని.. కమీషన్ ఇచ్చేలా ఒప్పందం చేసుకోవడంతో మట్టి తవ్వకాలు మళ్లీ కొనసాగుతున్నాయి.



అన్న చెబితే వదిలేయాల్సిందే..

చిత్రంలో కనిపిస్తున్న టిప్పర్లను రుద్రవరం తిప్ప నుంచి అక్రమంగా మట్టి తిరలిస్తుండగా శుక్రవారం వాటిని పట్టుకుని స్టేషన్‌కు తరలించారు. మట్టి టిప్పర్లను సీజ్ చేశారనే సమాచారం అంతటా చర్చనీయాంశమైంది. అయితే అంతలో ఏం జరిగిందో ఏమో శనివారం ఆ టిప్పర్లు మళ్లీ మట్టిని తరలిస్తూనే ఉన్నాయి. కనీసం వాటిపై ఏదైనా చిన్న కేసు కూడా పెట్టినట్లు లేదని, అసలు ఎలా పట్టుకున్నారో..? ఎందుకు వదిలి పెట్టారో..? అంతా అర్థం కావడం లేదని స్థానికులు చర్చించుకుంటున్నారు.

మట్టి దందాలో మచ్చుకు కొన్ని..

- ఆళ్లగడ్డ మండలం ఆర్.కృష్ణాపురం పరిధిలోని రామతీర్థం పుట్టాలమ్మ క్షేత్రం, మిట్టపల్లె, అహోబిలం వందలాది ఎకరాల్లో మట్టి తరలిస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారు
- రుద్రవరం మండలం ఆలమూరు, తిప్పారెడ్డి పల్లె, కోటకొండ, రుద్రవరం, లింగందిన్నె, పెద్ద కంబలూరు తదితర అటవీ ప్రాంతాల్లోని తిప్పలను పెద్దపెద్ద ప్రొక్లెయిన్లతో కొల్లగొట్టి టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా తరలిస్తున్నారు. పోలీస్, రెవెన్యూ కార్యాలయాల ముందు నుంచే యథేచ్ఛగా మట్టి దూర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు.
- చాగలమర్రి మండలం చిన్నవంగళి, చింతలచెరువు, ముత్యాలపాడు, వనిపెంట, మల్లెవేముల నగళ్లపాడు ప్రాంతాల్లో మట్టి తరలిపోతూనే ఉంది.
- శిరివెళ్ల మండలం మహదేవపురం, పచ్చర్ల, మహానంది మండలం గాజులపల్లె అటవీ, రెవెన్యూ భూముల్లో యథేచ్ఛగా అక్రమ తవ్వకాలు చేపట్టి మట్టి తరలిస్తున్నారు.

పేదలపైనే ప్రతాపం

సమీప గ్రామాల ప్రజలు తమ సొంత అవసరాలకు సంబంధించి ఒకటీ అరా ట్రాక్టర్లలో సమీపంలోని వంకలు, వాగుల్లో ఇసుక, మట్టిని తరలిస్తే వెంటనే అధికారులు వాటిని అడ్డుకుని ట్రాక్టర్లు సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించి, మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించే వరకు వదలి పెట్టడం లేదు. సామాన్యులకు పెద్ద ఎత్తున జరిమానా విధిస్తున్నారు. అదే అధికార పార్టీ నేత పేరు చెబితే నిత్యం వందల ట్రాక్టర్లు, టిప్పర్లలో యథేచ్ఛగా తరలిస్తున్నా అటువైపు కన్నెత్తి చూసే ప్రయత్నం చేయడం లేదు. అదీకాక అక్రమ తవ్వకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే వారినే వేధింపులకు గురిచేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు



అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుపుతున్నట్లు తమ దృష్టికి రాలేదు. ఇలాంటివి ఏవైనా ఉంటే విచారించమని ఆయా మండల తహసీల్దార్లకు ఆదేశాలు జారీ చేస్తాం. జిల్లా మైనింగ్ అధికారులతో మాట్లాడి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జునరెడ్డి, ఆర్డీఓ, నంద్యాల

ప్రజా వినతులకు సత్వర పరిష్కారం చూపాలి

- జిల్లా కలెక్టర్ రాజకుమారి

నంద్యాల(అర్బన్): ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన వినతులను క్షుణ్ణంగా పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ విష్ణు చరణ్, డీఆర్‌ఓ పద్మజ, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు, తదితరులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా స్వీకరించిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వినతులను సత్వరమే పరిష్కరించాలన్నారు. జిల్లాలో 84 శాతం ఫిర్యాదులను పరిష్కరించారని, నంద్యాల అర్బన్, రూరల్, పాణ్యం మండలాలలో వినతులు ఎక్కువగా పెండింగ్‌ల ఉన్నాయన్నారు. మండల స్థాయి సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించి పరిష్కరించాలన్నారు. కొన్ని మండలాలలో వినతులను పీజీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చూడటం లేదన్నారు. సమస్య తమకు సంబంధించింది కాకపోతే సంబంధిత అధికారికి ఫార్వర్డ్ చేయాలే తప్ప క్లోజ్ చేయడం సరికాదన్నారు. పాణ్యం, నంద్యాల, శిరివెళ్ల మండలాల అర్జీదారుల్లో అసంతృప్తి శాతం అధికంగా ఉందన్నారు. సర్వే అండ్ ల్యాండ్స్, డిస్ట్రిక్ట్ రిజిస్టర్ శాఖలలో ఫిర్యాదులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయన్నారు. జిల్లాలో 90 శాతం ఈ ఆఫీస్ ద్వారానే ఫైల్ పంపిస్తున్నారని డివిజన్, మండల స్థాయిలో కూడా 15 రోజులలో ఈ ఆఫీస్ ద్వారానే దస్త్రాలు రావాలన్నారు. కార్యక్రమంలో 357 వినతులు అందాయని, నిర్ణీత సమయంలోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.



వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ రాజకుమారి

నేటి నుంచి బీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో మంగళవారం నుంచి బీఈడీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలను నిర్వహిస్తున్నట్లు వర్సిటీ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు సోమవారం తెలిపారు. వర్సిటీ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ ఎన్‌టీకే నాయక్ ఆదేశాల మేరకు పరీక్షలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 15 పరీక్ష కేంద్రాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. రెగ్యులర్ 2,871 మంది, సప్లిమెంటరీ 410 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు పేర్కొన్నారు. పరీక్షల హాల్‌టికెట్లు సంబంధిత కళాశాల ప్రిన్సిపాల్, ఆన్‌లైన్ నుంచి పొందవచ్చని తెలిపారు. నిర్దేశించిన సమయానికి అరగంట ముందుగా విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు.

డీటీసీగా శాంతకుమారి



ఎస్. శాంతకుమారి, ఉపరవాణా కమిషనర్

కర్నూలు: రవాణా శాఖ ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీగా బదిలీలు జరిగాయి. కర్నూలు ఉప కమిషనర్‌గా శాంత కుమారి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇక్కడున్న శ్రీధర్ కాకినాడకు బదిలీ అయ్యారు. ఈయన 2022 జులై 15న విధుల్లో చేరి దాదాపు 26 మాసాల పాటు పనిచేశారు. రాష్ట్ర వ్యాప్త బదిలీల్లో భాగంగా ఏలూరులో ఉన్న శాంతకుమారి కర్నూలుకు నియమితులయ్యారు.

- ఆర్‌టీఓ రమేష్‌ను రంపచోడవరానికి బదిలీ చేస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈయన మూడేళ్ల పాటు ఇక్కడ పనిచేశారు.
- అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఆర్‌టీఓగా పనిచేస్తున్న లాల్‌సింగ్ చవాన్‌ను ఇక్కడకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.
- నంద్యాల ఆర్‌టీఓ శివారెడ్డిని కాకినాడకు బదిలీ చేసి విజయవాడలో పనిచేస్తున్న వై.ఐశ్వర్యా రెడ్డిని నంద్యాల ఆర్‌టీఓగా నియమించారు.
- కర్నూలు డీటీసీ కార్యాలయంలో ఎంవీఐగా పనిచేస్తున్న మనోహర్‌రెడ్డి అనంతపురానికి బదిలీ అయ్యారు.
- ఇక్కడ ముగ్గురు ఎంవీఐలు, ఇద్దరు ఏఎంవీఐలు ఉండగా ఒకరిని మాత్రమే బదిలీ చేయడం చర్చనీయాంశంగా మారింది.

పరిపాలన విభాగం సిబ్బంది కూడా బదిలీ

కర్నూలు, ఆదోని కార్యాలయాల్లో పనిచేస్తున్న పరిపాలన విభాగం సిబ్బంది కూడా బదిలీ అయ్యారు. కర్నూలు, ఆదోని కార్యాలయాల్లో జూనియర్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న రాజేష్, రహీంలను నంద్యాల రవాణా కార్యాలయానికి.. అక్కడ ఉన్న జూనియర్ అసిస్టెంట్లు హరిబాబును ఆదోనికి, వినీలను కర్నూలుకు, తిరుపతిలో పనిచేస్తున్న సువర్ణను నంద్యాల ఆర్‌టీఓ కార్యాలయానికి బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అలాగే ఆదోని కార్యాలయంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న నాగేశ్వరరావును అనంతపురానికి, అక్కడ ఉన్న హెడ్ కానిస్టేబుల్ అజాంను కర్నూలుకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి.

నంద్యాల ప్రభుత్వ వైద్య కళాశాల విద్యార్థి ప్రతిభ

- మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్



మహేష్

బొమ్మలసత్రం: నంద్యాల ప్రభుత్వ మెడికల్ కళాశాల విద్యార్థి మహేష్ మొదటి సంవత్సరం ఫలితాల్లో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జయమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఇటీవల విడుదలైన ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం ఫలితాల్లో నంద్యాల కళాశాల విద్యార్థులు మొత్తం 148 మంది ఉండగా వారిలో 121 మంది ఉత్తీర్ణత సాధించారు. 900 మార్కులకు గాను 741 మార్కులు సాధించిన మహేష్ రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచారు. కళాశాలలో ముగ్గురు జిల్లా స్థాయి ర్యాంకులు సాధించగా, 45 మంది ఫస్ట్ క్లాస్, 75 మంది సెకెండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో గతేడాది నంద్యాల మెడికల్ కళాశాలను నిర్మించగా అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కళాశాల విద్యార్థి రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటడంతో పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీపీల బదిలీలు

కర్నూలు (లీగల్): సాధారణ బదిలీల్లో భాగంగా ప్రభుత్వ న్యాయవాదుల (ఏపీపీ) బదిలీలు జరిగాయి. ఆలూరు ఏపీపీగా ఉన్న భాస్కర్ డోన్‌కు, కర్నూలు మొబైల్ కోర్టు ఏపీపీగా ఉన్న సుస్మిత నందికొట్కూరు, జువైనల్ కోర్టు ఏపీపీగా ఉన్న సుబ్బయ్య ఆళ్లగడ్డ, జేఎఫ్‌సీఎం కోర్టు ఏపీపీగా ఉన్న ఖాదర్ బాషా జువైనల్ కోర్టు అదనపు బాధ్యతలు, ఎమ్మిగనూరు ఏపీపీగా ఉన్న గోపాలకృష్ణ ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కోర్టు, ఆళ్లగడ్డ ఏపీపీగా ఉన్న అనిల్ కుమార్ మొబైల్ కోర్టు, డోన్ ఏపీపీ పద్మజ కదిరికి, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కోర్టు ఏపీపీగా ఉన్న విష్ణువర్ధన్ పలమనేరుకు బదిలీ అయ్యారు. నందికొట్కూరులో పనిచేస్తున్న రమాకిషోర్ ఆలూరు కోర్టుకు బదిలీ చేస్తూ అధికారులు ఆదేశాలు జారీ చేశారు.

పీహెచ్‌సీ వైద్యుల పోరుబాట



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్యులు

- జీవో 85ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్
- నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహణ

గోస్పాడు: ప్రాథమిక ఆరోగ్య కేంద్రా(పీహెచ్‌సీ)లలో పనిచేసే వైద్యులకు పీజీ వైద్య విద్యను అభ్యసించేందుకు ఇచ్చే ఇన్ సర్వీస్ కోటాను ప్రభుత్వం తగ్గించడంతో వారంతా నిరసనబాట పట్టారు. తమ డిమాండ్ నేరవేర్చక పోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరిస్తున్నారు. గతంలో ఉన్న ఇన్ సర్వీస్ కోటాను తగ్గించడం పట్ల మండిపడుతున్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్లు, సీహెచ్‌సీలలో పనిచేస్తున్న వైద్యులు నల్ల రిబ్బన్లు ధరించి విధులకు హాజరవుతున్నారు. పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోట కుదిస్తూ తీసుకొచ్చిన జీవో నెంబర్ 85ను పిహెచ్‌సీ వైద్యులు వ్యతిరేకిస్తున్నారు. ఇది అమలు చేయడం వల్ల తమ సర్వీస్‌కు అర్థం లేకుండా పోతుందని, అకస్మాత్తుగా జీవోను మార్చడం అన్యాయమని ఆవేదన చెందుతున్నారు. గతంలో ఇన్‌సర్వీస్ కోటా క్లినికల్ 30 శాతం ఉంటే దాన్ని 15 శాతానికి తగ్గించారు. నాన్ క్లినికల్ కోటాను 50 శాతం నుంచి 30 శాతానికి తగ్గించారు. గతంలో మాదిరి క్లినికల్ కోటాను 30 శాతానికి, నాన్ క్లినికల్ కోటాను 50 శాతానికి పెంచాలని వైద్యులు కోరుతున్నారు. ఇన్‌సర్వీస్ కోటా తగ్గిస్తూ ఇచ్చిన జీఓను రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ జీఓ వల్ల తమ వృత్తి ప్రగతికి తీవ్ర నష్టం వాటిలుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో పరిస్థితులిలా..

నంద్యాల జిల్లా పరిధిలో 52 పీహెచ్‌సీలు, 16 అర్బన్ హెల్త్ సెంటర్లు, 11 సీహెచ్‌సీలతో పాటు రెండు ఏరియా ఆసుపత్రిలలో దాదాపు 146 మంది వైద్యులు పనిచేస్తున్నారు. గత వారం రోజులకు పైగా నల్ల బ్యాడ్జీలను ధరించి పీహెచ్‌సీలో పనిచేసే వైద్యులు విధులు నిర్వహిస్తున్నారు. నిరసన కార్యక్రమాలను ఉధృతం చేసేలా కార్యాచరణ ప్రకటించారు. అయితే వైద్యుల సమస్యల పరిష్కారంపై వైద్యశాఖ కమిషనర్ కొంత గడువు ఇవ్వాలని వైద్యుల సంఘాలకు తెలిపారు. అయినా నల్ల బ్యాడ్జీలతో నిరసన కొనసాగిస్తున్నట్లు చెబుతున్నారు. కరోనాతో ప్రపంచాన్ని అతలాకుతలం చేసిన కోవిడ్–19 సమయంలో గ్రామీణ ప్రజలకు పీహెచ్‌సీ వైద్యులు తమ ప్రాణాలను ఫణంగా పెట్టి సేవలు అందించారు. వీరందరికీ సీట్లు ఇవ్వకపోగా గతం నుంచి ఉన్న అవకాశాలను తగ్గించి ఉన్నత విద్యకు దూరం చేయడం అన్యాయమని పీహెచ్‌సీ వైద్యులు వాపోతున్నారు. వీరికి పీజీ కోర్సుల్లో షరతులు లేకుండా గతంలో వైద్య విద్యలోని సీట్లను కేటాయించాలని కోరుతున్నారు.

సర్వీసు కోటా కుదిస్తే అన్యాయం

ప్రభుత్వం తమ సేవలను గుర్తించి పీజీ కోర్సుల్లో చేరేందుకు రాయితీలు ఇస్తుందనే ఉద్దేశంతో ఏళ్ల తరబడి పీహెచ్‌సీల్లో వైద్య సేవలు అందిస్తున్నాం. సర్వీసు కోటా కుదిస్తే తీవ్ర అన్యాయం జరుగుతుంది. పీహెచ్‌సీ వైద్యులకు వైద్య పీజీ కోర్సుల్లో గతంలో ఉన్న రిజర్వేషన్లను కొనసాగించాలి. ప్రస్తుతం ప్రభుత్వం ఇచ్చిన జీవో 85ను రద్దు చేయాలి.

– డాక్టర్ నితీష్, వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి

జిల్లాలో ఏడు టూరిజం సర్క్యూట్‌లు

మహానంది: జిల్లాలో చారిత్రాత్మకమైన ప్రదేశాలను పర్యాటకులు సందర్శించేలా ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ, దేవదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఏడు టూరిజం సర్క్యూట్‌లు ఏర్పాటు చేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు కలెక్టర్ రాజకుమారి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించారు. మహానంది పుణ్యక్షేత్రంతో పాటు నవనంది క్షేత్రాలను కలిపి టూరిజం సర్క్యూట్–1గా, మహానంది, సర్వనరసింహస్వామి ఆలయం, పచ్చర్ల నల్లమల జంగిల్ క్యాంప్‌లను టూరిజం సర్క్యూట్–2గా, బండిఆత్మకూరు మండలంలోని ఓంకారం, వైఎస్సార్ స్మృతివనం, రాజీవ్ గాంధీ అభయారణ్యంను టూరిజం సర్క్యూట్ –3గా, అహోబిలంలోని నవనరసింహ ఆలయాలను టూరిజం సర్క్యూట్–4, బనగానపల్లెలోని నవాబుల కోట, యాగంటి, బెలూం గుహలను కలిపి టూరిజం సర్క్యూట్–5, కొత్తూరు సుబ్బరాయుడు ఆలయం, నందవరం చౌడేశ్వరీదేవి ఆలయాలను టూరిజం సర్క్యూట్–6, బేతంచెర్ల సమీపంలోని బిల్వసర్గం గుహలు, శ్రీ లక్ష్మీమద్దిలేటిస్వామి ఆలయం, వాల్మీకి గుహలు కలిసి టూరిజం సర్క్యూట్ –7గా ఏర్పాటు చేసి జిల్లాలో మొత్తం పర్యాటక ప్రదేశాలను కలిపి చూసేందుకు ఏడు సర్క్యూట్‌లుగా విభజించి అభివృద్ధి చేయనున్నారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ రాజకుమారి ఇప్పటికే దేవదాయ, ఏపీ టూరిజం శాఖ అధికారులతో చర్చలు జరిపారు. ఆలయాలు, చారిత్రాత్మక ప్రదేశాల ఫొటోలు సేకరించి చరిత్ర, కిలోమీటర్ల దూరంతో పాటు ఆ ప్రాంత విశేషాలతో బోర్డులు ఏర్పాటు చేయించే పనిలో నిమగ్నమయ్యారు. ఈ బోర్డులను జిల్లాలోని ప్రముఖ ఆలయాలు, పర్యాటక ప్రదేశాల వద్ద అందరికీ తెలిసేలా ప్రదర్శించనున్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదంగా వివాహిత మృతి

ఓర్వకల్లు: గుట్టపాడు గ్రామంలో ఓ మహిళ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రమేష్‌కు ఐదేళ్ల క్రితం కర్నూలు బుధవారపేటకు చెందిన అరుణ(25)తో వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. దంపతులు ఇద్దరు కూలీ పనులకెళ్లి కుటుంబాన్ని పోషించుకునేవారు. కొంతకాలంగా అరుణ రక్తహీనతతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆదివారం రాత్రి బీపీ పూర్తిగా పడిపోవడంతో కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపా రు. కాగా మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, విచారణ చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

గెలుపోటములను సమానంగా స్వీకరించాలి


జిల్లా స్థాయి పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): గెలుపోటములను సమానంగా స్వీకరించాలని డిప్యూటీ డీఈఓ మహబూబ్ బేగ్ క్రీడాకారులకు సూచించారు. స్థానిక కేఎస్ఎం మున్సిపల్ హైస్కూల్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన ఉమ్మడి జిల్లాల జిల్లాస్థాయి స్కూల్ గేమ్స్ ఎంపిక పోటీలు సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. చదువుతో పాటు క్రీడాల్లో రాణించే విద్యార్థులకు ఉద్యోగావకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శివకుమార్ మాట్లాడుతూ అండర్ 14, 17 బాలబాలికలు పోటీలు నిర్వహించామన్నారు. రెజ్లింగ్, రోప్ స్కిప్పింగ్, టేబుల్ టెన్నిస్, బాల్‌బ్యాడ్మింటన్ క్రీడాంశాల్లో ఉమ్మడి జిల్లాల నుంచి 600 మంది బాలబాలికలు పాల్గొన్నారన్నారు. ఒలింపిక్ అసోసియేషన్ కర్నూలు జిల్లా మాజీ చైర్మన్ రవికృష్ణ, పాఠశాల హెచ్ఎం అసదుల్లా ఉశేన్, పీడీలు వెంకటేశ్వర్లు, భుజంగరావు, పీఈటీల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, సెక్రటరీ రవికుమార్ పాల్గొన్నారు.

విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే లక్ష్యం

కర్నూలు సిటీ: విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధే తమ విద్యా సంస్థల లక్ష్యమని ఉస్మానియా కాలేజీ కార్యదర్శి, కరస్పాండెంట్ అజ్రా జావెద్ తెలిపారు. సోమవారం కాలేజీలో డిగ్రీ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల పరిచయ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఉస్మానియా కాలేజీ స్థాపించినప్పటి నుంచి ఎంతో మంది విద్యార్థులకు భవిష్యత్‌ను ఇచ్చిందన్నారు. రెండు సార్లు న్యాక్ ఏ గ్రేడ్ సాధించిన ఘనత తమ కాలేజీకే దక్కిందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీవుద్దీన్ ముజమ్మిల్, ప్లేస్మెంట్ ఆఫీసర్, తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మండీ అన్వర్ హుస్సేన్ పాల్గొన్నారు.

ఏడు ఊర్ల గవి.. విశేషాల గని!

- ఫైబోగుల కొండల్లో విశాలమైన గుహ
- పదివేల మంది నివసించే అవకాశం
- నిత్యం నీటి ధార.. గుహలో శివలింగం
- అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి

గడివేముల: ఏడు ఊర్ల జనాలు పట్టే విశాలమైన గుహ అది.. లోనికి వెళ్లడానికి చిన్న మార్గం.. లోపల శివ లింగాన్ని అభిషేకిస్తూ నీటి ధార.. నంది విగ్రహం.. ఎవరో పరిచినట్లుగా బండరాయి ఉండటం... అక్కడి నుంచి కొంచెం ముందుకెళ్తే అంతుచిక్కని మరో గుహ... ఇలా ఎన్నో విశేషాలు ఉన్న ఏడు ఊర్ల గవి గడివేముల మండలం పైబోగుల గ్రామ సమీపంలోని కొండల్లో దర్శనమిస్తోంది. జిల్లాలో ప్రఖ్యాతి గాంచిన బెలుం గుహలు ఉన్నాయి. వీటితోపాటు ప్యాపిలి మండలంలో ఎరజ్రాల, బేతంచెర్ల మండలంలో వాల్మీకి గుహలు సహజ సిద్ధంగా ఏర్పడి పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. ఈ కోవకు చెందినదే ఏడు ఊర్ల గవి.


గుహలో నంది విగ్రహం, పానుమట్టం


గవిలో భక్తులకు దర్శనమిస్తున్న శివలింగం

దివిటీ దొంగల కంట పడకుండా గవిలోకి..


గడివేముల మండలం కె.బొల్లవరం పైబోగుల గ్రామాల మధ్యలో ఉన్న కొండల్లో ఉన్న ఏడు ఊర్ల గవికి ఎంతో చరిత్ర ఉంది. ఇక్కడ పూర్వం జనం నివసించారని చెప్పేందుకు స్థానికుల్లో ఓ కథనం ప్రాచుర్యంలో ఉంది. ఈకొండ ప్రాంతంలో గని రాజ్యం ఉండేది. ఆ కాలంలో దివిటీ దొంగలు పట్టపగలే దాడులు చేసి అందరినీ లూటీ చేసేవారు. వారి బారి నుంచి కాపాడుకునేందుకు బొల్లవరం, గడివేముల, మంచాలకట్ట, తలముడిపి, గని, కొరప్రోలూరు, బిలకలగూడూరు గ్రామాల ప్రజలు ఈ గుహలోకి చేరుకుని కొన్నాళ్ల పాటు ఇక్కడే తలదాచుకున్నారు. దీంతో ఈ గుహ ఏడు ఊర్ల గవిగా పేరొందింది.

ఏడాది పొడవునా నీటి ధార..

చుట్టుపక్కల కొండల్లో ఎక్కడ చూసినా చుక్క నీరు దొరకదు. అయితే గుహలోని శివలింగంపై మాత్రం నీరు ధారగా పడుతుండటం విశేషం. ఏడాది పొడవునా ఆ ధార అలాగే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. గొర్రెల కాపరులు, చుట్టుపక్కల పొలాల్లో పనిచేసే కూలీలు.. గుహ లోపలికి వెళ్లి నీటిని తాగుతుంటారు. ఏడు ఊర్ల గవితోపాటు లోపల మరొక గుహ ఉందని స్థానికులు చెబుతున్నారు. గుహ లోపల శివుడు, నంది విగ్రహాలు ఉండటంతో చుట్టు పక్కల గ్రామాల ప్రజలు కార్తీక మాసంలో, శివరాత్రి పర్వదినాన ఇక్కడ పూజలు నిర్వహిస్తారు. ఇక్కడే వన భోజనాలు చేస్తారు. కనీస వసతులు, రహదారి లేకున్నా పదుల సంఖ్యలో కుటుంబాలు ఎడ్ల బండ్లపై వచ్చి పండుగ చేసుకుంటాయి.

ఎలా చేరుకోవాలంటే..

కర్నూలు నుంచి 55 కిలో మీటర్ల దూరంలో గడివేముల ఉంది. అక్కడి నుంచి 6 కిలోమీటర్లు ప్రయాణిస్తే బొల్లవరం వద్దకు చేరుకోవచ్చు. బొల్లవరం నుంచి పొలాలకు వెళ్లే దారిలో రెండున్నర కిలోమీటర్ల దూరంలో ఏడు ఊర్ల గవి ఉంది. అంతా ఇసుకపొలాలు కావడంతో వాహనాల రాకపోకలు ఈ దారిలో కష్టమే ముఖ ద్వారం చాలా చిన్నగా ఉంది. బయటి నుంచి లోపలికి పది అడుగుల మేర కూర్చొని వెళ్లాల్సి ఉంది. గవిని అభివృద్ధి చేస్తే పర్యాటక ప్రాంతంగా ప్రసిద్ధి చెందే అవకాశం ఉంది.


గవి లోపలికి వెళ్లేందుకు ఉన్న చిన్న ముఖద్వారం


గుహ నుంచి బయటికి వస్తున్న యువకులు

అభివృద్ధి చేయాలి



మా ముత్తాతల కాలం నుంచి గవి అలాగే ఉంది. రోడ్డు, విద్యుత్ సౌకర్యం కల్పిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందుతుంది. రహదారుల వెంట బోర్డులు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేస్తే పర్యాటకులు వెళ్లడానికి సులువుగా ఉంటుంది. గుహలో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయాలి.

– ప్రతాప్‌రెడ్డి, గని గ్రామం

అనంతపురం డ్వామా పీడీగా సలీం బాషా

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్‌గా పనిచేస్తున్న సలీం బాషాను అనంతపురం జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. పంచాయతీరాజ్ శాఖలో డీఎల్‌డీఓ అయిన సలీం బాషా గత ఏడాది అక్టోబర్ నుంచి డీఆర్‌డీఏ పీడీగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం డీఆర్‌డీఏ పీడీగా ప్రతాపరెడ్డిని నియమించిన ప్రభుత్వం.. ఇక్కడ ఉన్న సలీం బాషాను అనంతపురం డ్వామా పీడీగా నియమించింది. ఈయన కర్నూలు జిల్లా నీటి యాజమాన్య సంస్థలో అదనపు పీడీగా పనిచేశారు.

హౌసింగ్‌లో బదిలీలు

కర్నూలు(అర్బన్): జిల్లా గృహ నిర్మాణ సంస్థలో పలువురు ఇంజనీర్లకు స్థాన చలనం కలిగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు.

- అన్నమయ్య జిల్లా మదనపల్లెలో ఈఈగా విధులు నిర్వహిస్తున్న పి.వెంకటదాసును కర్నూలుకు బదిలీ చేశారు.
- నంద్యాల ఈఈగా పనిచేస్తున్న శ్రీహరిగోపాల్‌ను నెల్లూరు జిల్లా కందుకూరుకు బదిలీ చేశారు.
- డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లలో ఆదోని నుంచి ఎం.రవికుమార్‌ను ప్రకాశంకు, డోన్ నుంచి దుగ్గి రాజశేఖర్‌ను జమ్మలమడుగుకు, నందికొట్కూరు నుంచి పి.విజయ్‌బాబును నందికొట్కూరు నుంచి ఆళ్లగడ్డకు బదిలీ చేశారు.
- కాగా హౌసింగ్ పీడీగా విధులు నిర్వహిస్తున్న ఎం.సిద్ధలింగమూర్తిని డీఎల్‌డీఓ బదిలీల్లో భాగంగా గుంటూరు జిల్లా ఈజీఎస్ ఏపీడీగా, పల్నాడు జిల్లా డ్వామా పీడీగా బదిలీ చేశారు. అయితే ఫారిన్ సర్వీసు కింద 2025 జనవరి వరకు ఆయన హౌసింగ్ పీడీగా కర్నూలులోనే కొనసాగే అవకాశముంది. ఈ నేపథ్యంలోనే ఆయనను రీప్యాట్రీషన్ చేసి కర్నూలులో హౌసింగ్ పీడీగా కొనసాగిస్తారా? లేక గుంటూరులో చార్జి తీసుకోవాల్సి ఉంటుందా? అనే విషయంపై మరో రెండు రోజుల్లో స్పష్టత రానుంది.

స్కందాన్షి హైబిస్కస్ కాలనీలో చోరీ


బీరువాను బద్దలు కొట్టిన దొంగలు

కర్నూలు: నగర శివారులోని ఉల్చాల రోడ్డులో ఉన్న స్కందాన్షి హైబిస్కస్ కాలనీలో దొంగలు పడి అందిన మట్టుకు దండుకుని పరారయ్యారు. బి4లో మహబూబ్ బాషా కుటుంబం నివాసముంటోంది. ఇంటికి తాళం వేసి ఉండటంతో దొంగలు ఆదివారం రాత్రి ప్రధాన తలుపుల గొళ్లెంతోపాటు లోపలి గదిలోని తాళాలు పగులకొట్టి బీరువాలోని 5 తులాల బంగారం, 5 తులాల వెండి, రూ.80 వేల నగదు మూటగట్టుకుని ఉడాయించారు. బి5 ఇంట్లోనూ చోరీకి యత్నించినట్లు సమాచారం. స్కంద ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ యాజమాన్యం కాలనీకి చెందిన సోలార్ ఫెన్సింగ్‌ను అపార్ట్‌మెంట్ నిర్మాణం కోసం పలు చోట్ల కత్తిరించడం వల్లే దొంగలు సులభంగా లోపలికి ప్రవేశించినట్లు కాలనీ వాసులు వాపోయారు.

పతకాలు సాధించడం అభినందనీయం

- క్రీడాకారిణి రేష్మాను సన్మానించిన కలెక్టర్ పి.రంజిత్‌బాషా


రేష్మాను సన్మానిస్తున్న కలెక్టర్ రంజిత్

కర్నూలు(సెంట్రల్): కర్నూలు క్రీడాకారిణి రేష్మా అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్‌లో నాలుగు పతకాలు సాధించడం అభినందనీయమని కలెక్టర్ పి.రంజిత్‌బాషా అన్నారు. నేపాల్‌లో జరిగిన అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ సీనియర్ విభాగంలో రేష్మా మూడు స్వర్ణాలు, ఒక సిల్వర్ పతకం గెలుచుకొని దేశానికి గర్వంగా నిలిచింది. ఈ క్రమంలో సోమవారం కలెక్టర్ ఆమెను తన కార్యాలయానికి పిలిపించుకొని సన్మానించారు. రేష్మా స్వగ్రామం నందికొట్కూరు మండలం బ్రాహ్మణ కొట్కూరు అయినా వారి తల్లిదండ్రులు కర్నూలులోనే స్థిరపడ్డారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కల్యాణి, డీఎస్‌డీఓ భూపతిరావు, పవర్ లిఫ్టింగ్ శిక్షకుడు వేణుగోపాల్ పాల్గొన్నారు.

డీఆర్‌డీఏలో రాజకీయ బదిలీలు

- తీవ్ర అవినీతి ఆరోపణలున్న వారికే అందలం

కర్నూలు(అగ్రికల్చర్): డీఆర్‌డీఏలో భారీగా బదిలీలు జరిగాయి. టీడీపీ ప్రజాప్రతినిధుల సిఫార్సులతో కోరుకున్న వారికి కోరుకున్న చోటు దక్కింది. పనితీరు, నిజాయతీ, అవినీతి ఆరోపణలను పరిగణలోకి తీసుకొని బదిలీలు చేపట్టాల్సి ఉండగా.. బదిలీల ప్రక్రియ మొత్తం టీడీపీ, బీజేపీ ప్రజాప్రతినిధులు చెప్పిన విధంగానే బదిలీలు జరిగాయి. పలువురు టీడీపీ నేతల నుంచి సిఫారస్సు చేయించడం వల్ల బదిలీల ప్రక్రియ ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు జరిగింది. వివిధ కేటగిరిలకు చెందిన 126 మందిని బదిలీ చేయగా.. ప్రతి ఒక్కరూ టీడీపీ, బీజేపీ నేతల సిఫార్సులతో కోరుకున్న చోటుకు బదిలీ అయ్యారు. బదిలీల్లో గతంలో ఎపుడూ లేని విధంగా రాజకీయ జోక్యం పెరిగిపోయింది. ఒకేచోట ఐదేళ్లు పనిచేసిన వారిని బదిలీ చేయడంతో పాటు రిక్వెస్ట్ బదిలీలు కూడా జరిగాయి. ఏపీఎంలకు అదే నియోజకవర్గంలోని పక్క మండలంలో పోస్టింగ్ లభించింది. పలురువు సీసీలు రాజకీయ అండదండలతో పనిచేస్తున్న క్లస్టర్ పక్కనే ఉన్న క్లస్టర్‌కు పోస్టింగ్ తీసుకోవడం పట్ల డీఆర్‌డీఏలో చర్చ జరుగుతోంది. బదిలీల ప్రక్రియలో టీడీపీ నేతలు భారీగానే ముడుపులు దండుకున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

కుమారుడిని అప్పగించాలంటూ పురుగు మందు తాగిన మహిళ

- ఆస్పత్రికి తరలించిన పోలీసులు


ఆత్మహత్యకు యత్నించిన తిరుమలమ్మ

ఆలూరు: భర్త ప్రమాదంలో మృతి చెందాడని, అత్తమామల వద్ద ఉన్న తన కుమారుడిని తనకు అప్పగించాలని కోరుతూ సోమవారం స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఓ మహిళ పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు తెలిపిన వివరాలు.. మండల పరిధిలోని అరికెర గ్రామానికి చెందిన పాండు రంగకు అదే గ్రామానికి చెందిన తిరుమలమ్మతో ఏడేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు గౌతమ్‌సాయి ఉన్నాడు. గత మే 18న మిద్దెపై నిద్రించిన పాండురంగ.. అర్ధరాత్రి మూత్ర విసర్జనకు లేచి నిద్ర మత్తులో మిద్దెపై నుంచి కింద పడి మృతి చెందాడు. కాగా పాండురంగ మృతికి తిరుమలమ్మ, ఆమె తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, లక్ష్మి కారణమంటూ అతడి తల్లిదండ్రులు గోవిందప్ప, హైమావతి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైంది. దీంతో తిరుమలమ్మ పుట్టినింటికి చేరుకోగా కుమారుడు గౌతమ్ సాయి నాన్నమ్మ, తాతయ్యల వద్దే ఉండిపోయాడు. దీంతో భర్తకు దూరమయ్యానని, కనీసం తన కుమారుడినైనా తన వద్దకు పంపించాలని తిరుమలమ్మ పలుమార్లు కోరినా వారు ససేమిరా అనడంతో విరక్తి చెంది పురుగు మందు తాగి ఆత్మహత్యకు యత్నించింది. పోలీసులు పురుగు మందు సీసాను లాక్కొని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం ఆదోనికి తీసుకెళ్లారు. కేసు నమోదు చేసి, విచారణ చేస్తున్నామని ఆలూరు హెడ్‌కానిస్టేబుల్ జానీవాకర్ తెలిపారు.

ఇంటి యజమానులు లేనప్పుడు స్టిక్కర్ అంటించెయ్..!


తాళం వేసిన ఇంటికి స్టిక్కర్ వేస్తున్న టీడీపీ కార్యకర్త


సమస్యలపై అధికారులను ప్రశ్నిస్తున్న ఎల్లంబావి కాలనీ వృద్ధురాలు నాగమ్మ

- మధ్యాహ్నం వేళలో స్టిక్కర్లు అంటిస్తున్న అధికారులు, టీడీపీ శ్రేణులు
- తూతూ మంత్రంగా 'ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం'

పగిడ్యాల: కూటమి ప్రభుత్వం ఏర్పడి వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని చేపట్టిన ఇది మంచి ప్రభుత్వ కార్యక్రమం మొక్కుబడిగా సాగుతోంది. సూపర్ సిక్స్ పథకాల బూచి చూపించి అధికారం చేపట్టిన కూటమి ప్రభుత్వం ఒక్కటి కూడా అమలు చేయకపోవడంతో వంద రోజుల పరిపాలనపై వివరించేందుకు వస్తున్న అధికారులను ప్రజలు నిలదీస్తున్నారు. సోమవారం నెహ్రూ నగర్ ఎల్లంబావి కాలనీలో గ్రామ ప్రత్యేక అధికారి సుభాన్, పంచాయతీ అధికారి వీరన్నయాదవ్ మధ్యాహ్నం వేళలో ఎంపీ వర్గీయులను వెంట బెట్టుకుని ఈ కార్యక్రమం నిర్వహించారు. కాలనీలో వృద్ధులను కలిసి కరపత్రాలు చేతిలో పెట్టి వెళ్లారు. తమ కాలనీలో సీసీ రోడ్లు లేదని, డ్రైయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు ఇళ్లలోకి వస్తుందని, మూడు రోజులకోసారి నీటి సరఫరా చేస్తున్నారని అలాంటప్పుడు మంచి ప్రభుత్వం ఎట్లా అవుతుందని వృద్ధులు నాగమ్మ, శాంతమ్మ, ఈశ్వరయ్య తదితరులు నిలదీయడంతో అధికారులను నీళ్ల నములులూ పింఛన్ రూ.4 వేలు వస్తుంది కదా అంటూ అక్కడి నుంచి జారుకున్నారు.

కొట్టుకున్న తెలుగు తమ్ముళ్లు

- కర్ణాటక మద్యం తరలింపు విషయంలో ఘర్షణ
- పలువురికి గాయాలు


కర్రలతో దాడి చేసుకుంటున్న టీడీపీ కార్యకర్తలు


గాయపడిన కందుకూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు

కోసిగి: రెండు గ్రామాలకు చెందిన తెలుగు దేశం పార్టీ కార్యకర్తలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. కర్ణాటక మద్యం అక్రమ సరఫరా విషయంలో తలెత్తిన వివాదం తీవ్ర స్థాయికి చేరి కర్రలతో కొట్టుకోవడంతో పలువురికి రక్త గాయాలయ్యాయి. వివరాలు.. కోసిగి మండలంలోని కందుకూరు, కౌతాళం మండలం తిప్పలదొడ్డి గ్రామాలకు కొందరు కర్ణాటక మద్యం సరఫరా చేసి విక్రయిస్తున్నారు. అయితే ఇటీవల కందుకూరు గ్రామస్తులను పోలీసులు మందలించారు. ఈక్రమంలో తిప్పలదొడ్డి గ్రామానికి కందుకూరు మీదుగా మద్యం తీసుకెళ్తుండగా కందుకూరు గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు అడ్డగించారు. ఈవిషయమై తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు మల్లయ్య, అనుమేష్, అళ్లయ్య, సురేష్ సోమవారం ఉదయం కందుకూరు గ్రామానికి చేరుకుని ఆ గ్రామ టీడీపీ కార్యకర్తలు పెద్ద రామయ్య, చిన్న రామయ్య, భీమేష్, శివ, రాజులతో గొడవ పడ్డారు. తమ గ్రామానికి మద్యం తీసుకొస్తుంటే ఎందుకు అడ్డుపడుతున్నారంటూ ఘర్షణకు దిగారు. మాటామాటా పెరిగి కళ్లల్లోకి కారం చల్లుకుని, కర్రలతో ఒకరికొకరు కొట్టుకున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. ఈ ఘటనలో కందుకూరు గ్రామానికి చెందిన ఐదుగురు టీడీపీ కార్యకర్తలు, తిప్పలదొడ్డి గ్రామానికి చెందిన కొందరు టీడీపీ కార్యకర్తలకు రక్త గాయాలయ్యాయి. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రమోహన్ తెలిపారు.

బాధితురాలికి ప్రభుత్వం అండగా ఉంటుంది

కర్నూలు(హాస్పిటల్): పెద్దకడబూరు మండలం కల్లుకుంట గ్రామానికి చెందిన దళిత మహిళ గోవిందమ్మకు ప్రభుత్వం అండగా ఉంటుందని జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. సోమవారం పెద్దాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలిని వారు పరామర్శించారు. ఈనెల 12న ఘటన జరుగుతున్న సయమంలో పోలీసులకు సమాచారం ఇచ్చిన వెంటనే స్పందించారా..లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి రూ.50 వేల మానిటరీ రిలీఫ్ ఫండ్ అకౌంట్‌లో జమ అయ్యిందా లేదా అని బాధితురాలి చిన్న కుమారుడు రాజును ఆరా తీశారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌శాఖ బాధిత మహిళ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కాగా గోవిందమ్మకు మెరుగైన వైద్యం అందించాలని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ. ఆనందబాబు, డీవైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నగేష్, కేవీపీఎస్ మహిళ రాష్ట్ర నాయకులు కె.రంగమ్మ తదితరులు డిమాండ్ చేశారు.

శ్రీశైలం బ్యాక్ వాటర్ తగ్గుముఖం



కొత్తపల్లి: మండలంలోని సప్తనది సంగమేశ్వరం వద్ద శ్రీశైలం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ అయిన కృష్ణాజలాలు తగ్గుముఖం పట్టాయి. మల్యాల ఎత్తిపోతల, పోతిరెడ్డిపాడు హెడ్ ఎగ్యూలేటర్ నుంచి నీటి విడుదల కొనసాగుతోంది. దీంతో సోమవారం శ్రీశైలం జలాశయం నీటిమట్టం 885 అడుగుల నుంచి 875 అడుగులకు చేరుకుంది. సంగమేశ్వరం వద్ద ఎగువ పుష్కర్‌ఘాట్ పైమెట్టు నుంచి 10 అడుగుల మేర నీటిమట్టం తగ్గింది.

రిజిస్ట్రేషన్ శాఖలో వీడని బదిలీల ఉత్కంఠ

- నామమాత్రంగా కౌన్సెలింగ్
- వివరాలను ఐజీ కార్యాలయానికి పంపిన అధికారులు
- వెల్లడికాని జాబితా.. ఆందోళనలో ఉద్యోగులు



కర్నూలు(సెంట్రల్): స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలకు తెరపడలేదు. 23వ తేదీలోపు బదిలీల ప్రక్రియ పూర్తి చేసి ఆపై నిషేధం విధించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. అయినా ఇక్కడ మాత్రం బదిలీ జాబితా విడుదల చేయకపోవడంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. ఈ ఉత్కంఠ మరో రెండు, మూడు రోజుల వరకు కొనసాగే అవకాశం ఉంది.

ఐజీ కార్యాలయం పర్యవేక్షణలోనే ..

స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్‌లో బదిలీల ప్రక్రియ ఈసారి గతానికి భిన్నంగా సాగుతోంది. ఈనెల 22వ తేదీన జోన్-4 పరిధిలోని కర్నూలు, అనంతపురం, చిత్తూరు, వైఎస్ఆర్ ఉమ్మడి జిల్లాల సబ్ రిజిస్ట్రార్లు, సీనియర్ అసిసెంట్లకు కర్నూలులోని ఆ శాఖ డీఐజీ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. నోడల్ అధికారిగా కర్నూలు డీఐజీ పీజీ కల్యాణి వ్యవహరించగా అడిషినల్ ఐజీ ఉదయ భాస్కరరావు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. కానీ కౌన్సెలింగ్ నామమాత్రంగా జరిగిందని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. ముందుగా వారే ఎవరిని ఎక్కడికి పంపాలో నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. నామ మాత్రంగా ఉద్యోగుల నుంచి ఆప్షన్లు తీసుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాక మొత్తం వివరాలను ఐజీ కార్యాలయానికి పంపారు. అక్కడే స్థానాల కేటాయింపు జరుతుందనే గుసగుసలు వినిపిస్తున్నాయి. అలాంటప్పుడు తమతో ఆప్షన్లు తీసుకోవడమెందుకనే భావనను కొందరు ఉద్యోగులు వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు స్థానాన్ని బట్టి మూడుపులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. ఆదాయం ఎక్కువగా వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు రూ.40 లక్షల వరకు వసూలు చేసి పోస్టింగ్‌లు కేటాయించేలా కొందరు రిజిస్ట్రేషన్ శాఖాధికారులు పావులు కదుపుతున్నట్లు సమాచారం. మొత్తంగా ముడుపులు సమర్పించుకోనిదే సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేసే అవకాశం రావడంలేదని కొందరు బహిరంగంగానే వాపోతున్నారు.

కొందరి పేర్లు ముందుగానే బయటకు..

కొందరు సబ్‌రిజిస్ట్రార్లు బదిలీ అయినట్లు అనధికారికంగా ముందుగానే జాబితా విడుదలైనట్లు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. ఆళ్లగడ్డలో విధులు నిర్వహిస్తున్న అబ్దుల్‌సత్తార్‌ను నంద్యాల జాయింట్-1 సబ్ రిజిస్ట్రార్‌గా, నంద్యాల జాయింట్-1గా విధులు నిర్వహిస్తున్న సునందను విజయవాడ ఐజీ కార్యాలయానికి, బండిఆత్మకూరులో పనిచేస్తున్న నేంద్రరాజును పాణ్యంకు, ఆత్మకూరు ఎస్ఆర్ ఆదినారాయణను బండిఆత్మకూరుకు, నంద్యాల జాయింట్-2 వనితలక్ష్మిని బేతంచెర్లకు, కడప జిల్లా నుంచి వచ్చిన చైతన్యరాయుడును ఆళ్లగడ్డకు, బేతంచెర్లలో ఉన్న కరీంను ఆత్మకూరుకు, కర్నూలులో విధులు నిర్వహిస్తున్న ఫైరోజ్‌ను ఓర్వకల్లుకు, ఉరవకొండలో ఉన్న పి.శ్రీనివాసులును ఎమ్మిగనూరుకు, గూడూరులో విధులు నిర్వహిస్తున్న శివకుమార్‌ను కోవెలకుంట్లకు, పాణ్యం తేజోవతిని కోడుమూరుకు బదిలీ చేసినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటి వరకు రిజిస్ట్రేషన్ శాఖ అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. ఇప్పటికే కౌన్సెలింగ్ జరిగి మూడు రోజులు గడుస్తున్నా ఎక్కడికి బదిలీ అయ్యామో తెలియ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.